


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
నేటి సందేశం రేపటి పొద్దు జాడ
20 YEARS ANNIVERSARY
https://www.satyamdaily.net/
బుధవారం 2-7-2025
సంపుటి: 21 సంచిక: 85
పేజీలు: 8 వెల: రూ.1

- గౌరవ వేతనాలకు నోచుకోని ఎంపీటీసీ, జెడ్పీటీసీలు
- ఎంపీపీలు, జెడ్పీ చైర్‌పర్సన్‌దీ అదే దుస్థితి
- 33 నెలల బకాయిలు పెండింగ్ పెట్టారని ఆవేదన
- మూడుసార్లు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసినా నిధుల్లేక ల్యాప్స్
- మొత్తం రూ.82 లక్షల బకాయిలు ఉన్నట్లు అంచనా




# 'స్థానిక' ప్రతినిధులపై సిరికన్నో!

తమకు జీతాలు సక్రమంగా అందడం లేదని సాధారణంగా ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తుంటారు, ఆందోళనలు చేస్తుంటారు. కానీ ప్రజాప్రతినిధులుగా ఎన్నికై పరిపాలనలో భాగస్వాములవుతున్నవారు కూడా జీతాల బాధితులేనని తాజాగా తెలిసింది. ఇలా జీతాలు అందని ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యేలు కాదు.. గ్రామ స్వపరిపాలనను సాకారం చేయాల్సిన స్థానిక సంస్థల ప్రతినిధులైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు. ఆ మధ్య జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో జి.సిగడాం జెడ్పీటీసీ ఇదే విషయాన్ని ప్రస్తావించి, వెంటనే జీతాలు చెల్లించేలా చొరవ చూపాలని సమావేశంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. కానీ నాలుగు నెలలైనా ఇంతవరకు స్పందన లేదు.

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు జెడ్పీటీసీలకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం సుమారు రూ.82 లక్షలు బకాయి పడినట్లు జిల్లాపరిషత్ అధికారులు చెబుతున్నారు. వీరి జీతాల బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసినా నిధులు రిలీజ్ కావడం లేదంటున్నారు. ఉమ్మడి జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్‌తో సహా 38 మంది జెడ్పీటీసీలు, ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు.. మొత్తం 40 మంది ఉన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌కు రూ.40 వేలు, జెడ్పీటీసీలు, కో ఆప్షన్ సభ్యులకు రూ.ఆరు వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. 2022 సెప్టెంబర్ నుంచి 2023 జులై వరకు 11 నెలల గౌరవ వేతనాలకు సంబంధించి రూ.26.90 లక్షల బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో జిల్లా అధికారులు అప్‌లోడ్ చేశారు. అయినా నిధులు విడుదల కాకపోవడంతో అవి మూడుసార్లు ల్యాప్స్ అయ్యాయి. ఆ తర్వాత 2023 ఆగస్టు నుంచి 2025 మార్చి వరకు 20 నెలల గౌరవ వేతన బకాయిలు రూ. 54.80 లక్షలు పేరుకుపోయాయి. ప్రభుత్వం వీటికి గ్రాంటే రిలీజ్ చేయలేదని సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్ నెలల గౌరవ వేతనాలు కూడా అందలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.33.06 లక్షలు కేటాయించింది. ఈ బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. పాత బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం గ్రాంట్ రిలీజ్ చేస్తే తప్ప ఆ బిల్లులను అప్‌లోడ్ చేయలేరు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లగా ఇప్పటి వరకు ఉన్న బకాయిల వివరాలు పంపించాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశించారు. ఆ మేరకు జెడ్పీ అధికారులు వివరాలు పంపినట్లు తెలిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.33 లక్షలు గ్రాంట్ విడుదల చేసినా సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయడానికి సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయంటున్నారు. 2021 అక్టోబర్‌లో పదవుల్లోకి వచ్చిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు సుమారు నాలుగేళ్ల పదవీ కాలంలో కేవలం 11 నెలల గౌరవ వేతనం మాత్రమే అందుకున్నారు. ఇంకా 33 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

**.సర్పంచుల పరిస్థితి కొంత నయం**

మరోవైపు ఎంపీటీసీలు, సర్పంచ్‌ల గౌరవ వేతనాలు కూడా విడుదల చేయాల్సి ఉంది. సర్పంచ్‌లకు జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి.. ఎంపీపీ, ఎంపీటీసీలకు మండల పరిషత్ కార్యాలయాల నుంచి నిధులు విడుదల చేయాలి. సర్పంచ్‌లకు నెలకు రూ.మూడు వేలు చొప్పున ఆరు నెలలకోసారి గౌరవ వేతనాలు జమ చేస్తున్నారు. ఆ మేరకు గత ఏడాది డిసెంబర్ వరకు పెండింగు ఉన్న వేతనాలను ఈ ఏడాది జనవరిలో చెల్లించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆరు నెలల గౌరవ వేతనం బకాయి ఉంది. ఎంపీటీసీలకు నెలకు రూ.మూడు వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. అయితే జెడ్పీటీసీల మాదిరిగానే వీరికి కూడా 11 నెలల గౌరవ వేతనాలే ఇంతవరకు చెల్లించారు. 33 నెలల వేతనాలను పెండింగులో పెట్టేశారని స్థానిక సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెట్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల పదవీ కాలం మరో ఏడాదిలో ముగుస్తున్నా గౌరవ వేతనాల చెల్లింపులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటాన్ని వారంతా తప్పు పడుతున్నారు.

**నాటి సంప్రదాయాలకు చెల్లుచీటి**

మండలంలో సుమారు 50 నుంచి 70 వేల జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న జెడ్పీటీసీలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు, స్థాయి సంఘ సమావేశాలకు హాజరు కావాల్సి ఉంటుంది. దారి ఖర్చులను సొంతంగా భరిస్తూనే వారంతా రావాల్సి ఉంటుంది. రిజర్వ్‌డ్ కేటగిరీలో ఎన్నికైన బడుగు, బలహీన వర్గాల జెడ్పీటీసీలకు ఇది ఆర్థిక భారమేనని అంటున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జెడ్పీ

- మిగతా చివరి పేజీలో



# మానవ రక్తంలో మరో అరుదైన గ్రూప్

- 15 ఏళ్ల పరిశోధన తర్వాత కనుగొన్న ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు
- గ్వాడా నెగిటివ్‌గా నామకరణం.. ఐఎస్‌బీటీ గుర్తింపు
- సర్జరీకి వచ్చిన ఓ మహిళలో దీన్ని కనుగొన్న వైద్యులు
- ప్రపంచంలో 48వ రక్త గ్రూప్‌గా ప్రకటన

**డి.వి.రమణ**, సత్యం ప్రత్యేక ప్రతినిధి

మానిషి జీవించడానికి రక్తం అతి కీలకమైనది. శరీరంలో రక్తం తగినంతగా లేకపోయినా.. కలుషితమైనా సదరు వ్యక్తులు తీవ్ర వ్యాధుల ముప్పును ఎదుర్కొంటుంటారు. రక్త లేమిని సూచించేది మొదట ఎనీమియా అనే అవలక్షణం. దీన్ని సకాలంలో గుర్తించి తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోకపోతే పరిస్థితి విషమించి.. చివరికి ప్రాణాల మీదకు తెస్తుందని వైద్యులు చెబుతున్నారు. రక్తం చూడటానికి ఎరుపు రంగుతో ఒకేలా ఉన్నా.. అందరి రక్తం ఒకే జాతికి చెందినది కాదు. రక్తంలోని తెల్ల, ఎర్ర రక్త కణాలు, ఇతర ప్రత్యేకతల అధారంగా రక్తన్ని 47 గ్రూపులుగా వర్గీకరించారు. దీని ప్రకారం శస్త్రచికిత్సలు చేసేటప్పుడు, ఎవరికైనా రక్తం ఎక్కించాల్సి వచ్చినప్పుడు రోగి రక్త గ్రూపు కలిగి ఉన్న వారి నుంచే రక్తం సేకరిస్తారు. లేకపోతే వేరేవారు ఇచ్చిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకులో ఎక్స్ఛేంజ్ చేసి కావలసిన గ్రూపు రక్తం ఇస్తుంటారు. రక్త గ్రూపుల్లో మూడు అరుదైన రకాలుగా గుర్తించిన వైద్య పరిశోధకులు తాజాగా మరో అరుదైన రక్త గ్రూపును కనుగొన్నారు. అదే గ్వాడా నెగిటివ్ గ్రూప్.

**15 ఏళ్ల పరిశోధన**

సుమారు 15 ఏళ్ల పరిశోధన తర్వాత ఈ అరుదైన కొత్త రక్త గ్రూపును ఫ్రెంచ్ వైద్య పరిశోధకులు గుర్తించారు. కరీబియన్ దీవులకు చెందిన ఓ ఫ్రెంచ్ మహిళలో ఈ కొత్త రకం రక్త వర్గాన్ని కనుగొన్నారు. ఈ బ్లడ్ గ్రూప్‌ను 'గ్వాడా నెగిటివ్'గా ఫ్రాన్స్‌కు చెందిన ఫ్రెంచ్ బ్లడ్ సప్లై ఏజెన్సీ ప్రకటించింది. ప్రపంచం మొత్తంలో ఈ కొత్త బ్లడ్ గ్రూప్ కలిగిన వ్యక్తి ఈ మహిళ మాత్రమే. ప్యారిస్‌లో నివసిస్తున్న గ్వాడెలోప్ ప్రాంతానికి చెందిన 54 ఏళ్ల మహిళ 2011లో ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వెళ్లింది. ఆమెకు సర్జరీ అవసరమని గుర్తించిన వైద్యులు.. దానికి ముందు సాధారణంగా చేసే వైద్య పరీక్షలు చేయించారు. అయితే రక్త పరీక్ష కోసం ఆమె నుంచి సేకరించి రక్త నమూనా అసాధారణంగా కనిపించి వైద్యులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఆమె శరీరం నుంచి తీసుకున్న శాంపిల్ ఏ బ్లడ్ గ్రూపులతోనూ సరిపోలలేదు. ఆమె రక్తంలో ఉన్న యాంటీ బాడీస్‌ను ఇంతవరకు ఏ రక్త గ్రూపులోనూ గుర్తించలేదని వైద్యులు పేర్కొన్నారు. అసాధారణంగా ఉన్న ఈ బ్లడ్ శాంపిల్‌ను ప్రయోగశాలకు పంపి ఏకంగా ఎనిమిదేళ్ల పాటు పరిశోధనలు జరిపినా ఎలాంటి ఫలితం రాలేదు. ఆ రక్తం ఎలా వర్గీకరించాలో వైద్య నిపుణులకు అర్థం కాలేదు. అయితే 2019లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికత సహాయంతో పట్టు వదలని విక్రమార్కుల్లా మళ్లీ పరిశోధన మళ్లీ ప్రారంభించారు. హై క్వాలిటీ థ్రోపుట్ డీఎన్ఏ సీక్వెన్సింగ్ సహాయంతో మరో ఆరేళ్లు పరిశోధించిన శాస్త్రవేత్తలు ఎట్టకేలాకు ఆ రక్తం అనుపానులు కనుగొన్నారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్రూపులకు అదనంగా దీన్నో కొత్త రక్తం గ్రూపుగా నిర్ధారించారు. ఆ రక్తాన్ని కలిగి ఉన్న మహిళ నివాస ప్రాంతం గ్వాడెలోప్ పేరు కలిసి వచ్చేలా ఈ కొత్త గ్రూపునకు గ్వాడా నెగిటివ్ గ్రూప్ అని నామకరణం చేశారు. ఈ మహిళ తల్లిదండ్రులు ఇద్దరూ అరుదైన వేర్వేరు జన్యువులు కలిగి ఉండేవారు. వారి జన్యువులే కుమార్తెకు సంక్రమించాయి. ఆమె శరీరంలో ఆ రెండు కలిసి జెనిటిక్ మ్యుటేషన్‌కు గురి కావడం ద్వారా ఈ సరికొత్త బ్లడ్ గ్రూప్ ఆవిష్కారమైందని పరిశోధకులు ఎట్టకేలకు తేల్చారు.

**48వ కొత్త బ్లడ్ గ్రూప్**

ప్రపంచంలో ఇప్పటి వరకు మొత్తం 47 రకాల బ్లడ్ గ్రూప్స్ ఉన్నాయి. కొత్తగా కనుగొన్న గ్వాడా నెగిటివ్ గ్రూప్‌ను 48వ రకం బ్లడ్ గ్రూప్‌గా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆ మేరకు ఫ్రెంచ్ బ్లడ్ ఎస్టాబ్లిష్‌మెంట్ 48వ రక్తవర్గాన్ని గురించి అధికారికంగా ప్రకటించింది. ఈ బ్లడ్ గ్రూప్‌నకు ఇటీవలే ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ (ఐఎస్‌బీటీ) గుర్తింపు కూడా లభించింది. ఇప్పటి వరకు ఈ సంస్థ 47 రక్తవర్గాలను అధికారికంగా గుర్తించింది. వాస్తవానికి ఇంతవరకు 47 గ్రూపులు ఉన్నా వాటిలోని కణాలు, యాంటిజెన్స్ ఆధారంగా ప్రధానంగా నాలుగు గ్రూపులుగా, ఎనిమిది ఉప వర్గాలుగా వ్యవహరిస్తున్నారు. ఏ, బీ, ఓ, ఏబీ పాజిటివ్ గ్రూప్‌లు ప్రధానమైనవి కాగా.. వీటిలోనే ఏ నెగిటివ్, బీ నెగిటివ్, ఓ నెగిటివ్. ఏబీ నెగిటివ్ పేర్లతో ఉప వర్గాలు అధికంగా చెలామణీలో ఉన్నాయి.

**అరుదైన గ్రూపల్లో నాలుగోది**

ప్రస్తుతం గుర్తించిన 48 రక్త గ్రూపుల్లో ఆర్‌హెచ్ నల్, బాంబే బ్లడ్ గ్రూప్, ఏబీ నెగిటివ్‌లను అరుదైన గ్రూపులుగా పరిగణిస్తున్నారు. ఇప్పుడు వాటి సరసన గ్వాడా నెగిటివ్ గ్రూప్ చేరింది. ప్రస్తుతానికి ఈ గ్రూప్ రక్తం కలిగిన మహిళ ఒక్కరే ఉన్నారు.

- ఆర్‌హెచ్ నల్ గ్రూప్ రక్తంలో ఎర్ర రక్త కణాలపై ఆర్‌హెచ్ యాంటిజెన్స్ ఉండవు. ప్రపంచంలోని ప్రతి ఆరు మిలియన్ల ప్రజల్లో ఒకరికి మాత్రమే ఈ గ్రూప్ రక్తం ఉంటుంది.
- హెచ్‌హెచ్ అనే సాంకేతిక నామంతో పిలిచే బాంబే బ్లడ్ గ్రూపులో హెచ్(క్యాపిటల్ హెచ్) యాంటిజెన్ ఉండదు. ఇది సాధారణంగా ఓ బ్లడ్ గ్రూప్‌లా కనిపించినా క్రాస్ మ్యాచింగ్‌లో తేడా చూపిస్తుంది.
- ఏబీ నెగిటివ్ గ్రూప్‌ను కూడా అరుదైనదిగానే పరిగణిస్తున్నారు. ఇది జనాభాలో అతి తక్కువగా ఒక్క శాతం మందిలోనే రక్త గ్రూపు ఉంటుంది.

అందువల్లే ఈ గ్రూపుల రక్త సేకరణ, మార్పిడి ప్రక్రియల్లో ఇబ్బందులు ఎదురవుతుంటాయి.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించకపోతే

# పోరాటాలు ఉధృతం



**(సత్యంన్యూస్, మందస)**

ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామాల గిరిజనుల భూములకు రక్షణ కల్పించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు కే.మోహన్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం గిరిజన సంఘంతో కలిసి సీపీఎం నాయకులు సరిహద్దు గ్రామాలు అయినా దాల్సరి, మాణిక్యపట్నం, గుడ్డుకోల, మద్దికళ్లు గ్రామాలను పర్యటించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాల్లో ప్రజలు సీపీఎం బృందానికి పలు సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. ఒడిశా సరిహద్దులో ఉన్న దాల్సార్ గ్రామస్తులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన డి-పట్టా భూములు ఒడిశా ప్రభుత్వం ఆక్రమించుకొని ఫారెస్ట్ ఆఫీసు కమ్యూనిటీ భవనం తదితర కార్యాలయాలు నిర్మించుకున్నాయని, అయినా మన జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొండమీర గ్రామంలో గిరిజనులు సాగుచేస్తున్న భూములను, చెరువులను ఒడిశా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అక్కడ ఒడిశా నుంచి వచ్చిన వారికి ఒక గ్రామాన్ని నిర్మించిందని, సింగుపురంలో ఆ గ్రామంలోని స్మశానాన్ని ఒడిశా ప్రభుత్వం ఆక్రమించుకుందని, మాణిక్యపట్నంలో వారి భూములు రోడ్లు ఒడిశా ప్రభుత్వం ఆక్రమించుకుందని, మన రాష్ట్ర ప్రభుత్వం వేసిన రోడ్లపైన ఒడిశా ప్రభుత్వం రోడ్డు నిర్మిస్తుందని, అయినా మన అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యలని జిల్లా యంత్రాంగం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాణిక్యపట్నంలో గతంలో అంగన్వాడి బిల్డింగ్‌కు తాళాలు వేసి అడ్డుకున్న వారిపై అక్రమంగా కేసులు కూడా పెట్టారని బృందం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం నాయకులు గోవిందరావు, మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సరిహద్దు గ్రామాల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న మందస తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, ప్రజల మద్దతుతో దశల వారి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షులు సవర గురునాధ, సవర ఫల్గుణరావు, సవర పరశురాం, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, సవర తుంబేషు, సవర శశి, సవర భీముడు, సవర సోమేశు, సవర రాజు, సవర డుంబురు తదితరులు పాల్గొన్నారు.


• ఎడిటోరియల్

# యువజనంలో పెరుగుతున్న ఆత్మహత్యలు

మనదేశం జనసంఖ్యలో ప్రపంచంలోనే తొలి స్థానంలో ఉందన్నది తెలిసిందే. గతంలో చైనా అగ్రస్థానంలో ఉండేది. కానీ కఠిన కుటుంబ నియంత్రణ విధానాలు అనుసరించడం ద్వారా జనాభాను గణనీయంగా తగ్గించుకోగలిగింది. ఎంతలా అంటే.. ఇప్పుడు జనసంఖ్య భారీగా తగ్గిపోతుండటం.. అదే సమయంలో అత్యాధునిక వైద్య విధానాల వల్ల మనుషుల అయుఃప్రమాణం పెరిగి దేశ జనాభాలో వృద్ధుల సంఖ్య ఎక్కువైపోతోంది. యువజనులు తగ్గిపోతున్నారు. దాంతో ఆందోళన చెందిన చైనా ప్రభుత్వం ఎక్కువ మంది పిల్లలను కనడాన్ని ప్రోత్సహిస్తోంది. చైనా సంగతి పక్కన పెడితే.. భారత్‌లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కు.ని. కార్యక్రమాలు ధారాళంగా నిర్వహిస్తున్నా జనాభా పెరిగిపోతోంది. మరణాల కంటే జననాల రేటు అధికంగా ఉండటమే ఈ పరిస్థితికి కారణమని సామాజిక వేత్తలు విశ్లేషిస్తున్నారు. అయితే దేశవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాల్లో ఆత్మహత్యల కేసులే గణనీయ సంఖ్యలో నమోదవుతుండటం.. ఈ తరహా బలవన్మరణాలకు మహిళలు, యువజనులే అధికంగా పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా ఆత్మహత్య కేసులు భారీగా పెరుగుతున్నట్లు కాజ్ ఆఫ్ డెత్ నివేదిక వెల్లడించింది. క్షణికావేశాలు, అనాలోచిత నిర్ణయాలు, మానసిక సమస్యలు, ఒంటరితనం, శారీరక సమస్యలు, కుటుంబ ఇబ్బందులు, గృహ హింస, ప్రేమ వైఫల్యం, చదువు, ఉపాధిలో వెనుకబడటం వంటి కారణాలను యువతను బలవన్మరణాలకు ప్రేరేపిస్తున్నట్లు ఈ అధ్యయన నివేదిక గుర్తించింది. ఎంతో భవిష్యత్తు ఉన్న యువత ఇలా చిన్న చిన్న కారణాలకు భవిష్యత్తుపై ఆశలు కోల్పోయి ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరహా ఘటనలు ఎన్నో వేల కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. చేతికి అందివచ్చి ఆసరాగా నిలుస్తారనుకున్న పిల్లలు అలా అర్ధాంతరంగా బలవన్మరణాలకు పాల్పడుతూ ఈ లోకాన్ని, తమ కుటుంబాలను వీడి వెళ్లిపోతుండటంతో కన్నవాళ్లకు కడుపుకోత మిగల్చడంతోపాటు ఆ కుటుంబాలకు అండ లేకుండా చేస్తున్నారు. భారతదేశంలో యువత ఆత్మహత్యలకు సంబంధించి సంచలన విషయాలు ఈ అధ్యయనంలో వెల్లడయ్యాయి. దేశంలో యువత.. ముఖ్యంగా 15-29 సంవత్సరాల మధ్య వయస్కుల మరణానికి గత రెండు దశాబ్దాలుగా ఆత్మహత్యలే ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. 2020-22 మధ్యకాలంలో అధ్యయనం నిర్వహించిన ఎస్ఆర్ఎస్ కాజ్ ఆఫ్ డెత్ నివేదిక ప్రకారం 15-29 మధ్య వయసు గల యువతకు సంబంధించి ప్రతి ఆరు మరణాల్లో ఒకదానికి ఆత్మహత్య కారణమవుతోందని క్రైమ్ రికార్డులు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గణాంకాల ప్రకారమే కాకుండా, కేంద్ర ప్రభుత్వానికి చెందిన రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం కూడా ఈ అంశం నిర్ధారితమైంది. ఈ ఆత్మహత్యల్లో కూడా మహిళలవే ఎక్కువ ఉండటం చాలా విచారకరం. మొత్తం ఆత్మహత్యల్లో మహిళల వాటా 18.2 శాతంగా ఉండగా, పురుషులలో ఇది 16.3 శాతంగా ఉంది. మొత్తంగా చూస్తే 15-29 ఏళ్ల వయస్సు వారిలో 17.1 శాతం మంది ఆత్మహత్య చేసుకునే ప్రాణాలు కోల్పోతున్నారు. ఆత్మహత్యల తర్వాత స్థానాల్లో రోడ్డు యాక్సిడెంట్లు (15.6 శాతం), గుండె సంబంధిత వ్యాధులు (9.6 శాతం), ఇతర ప్రమాదాలు (8.7 శాతం), జీర్ణ సంబంధిత వ్యాధులు (6.4 శాతం), శ్వాస సంబంధిత ఇన్ఫెక్షన్లు (5.3 శాతం) యువత మరణాలకు కారణమవుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్కుల్లో ఆత్మహత్యలకు ప్రధాన ఐదు కారణాలు ఉన్నట్లు వర్గీకరించారు. ఆత్మహత్యల్లో ప్రేమ వైఫల్యం కేసులే 34.2 శాతంతో అగ్రస్థానంలో నిలుస్తున్నాయి. ఆ తర్వాత పెళ్లి సంబంధిత సమస్యలు (8 శాతం), మానసిక అనారోగ్యం (7.4 శాతం), కుటుంబ వివాదాలు (7.5 శాతం), మాదక ద్రవ్యాల వ్యసనం (5.2 శాతం) ప్రధాన కారణాలుగా ఉంటున్నాయి. మరో విషయం ఏమంటే.. పెళ్లి సంబంధిత సమస్యల కారణంగా జరిగే ఆత్మహత్యల్లో 28 శాతం మాత్రమే పురుషులవి కాగా.. మిగిలిన 72 శాతం మహిళలవే నమోదు కావడం గమనార్హం. దేశంలో ఏటా 60 వేలకు పైగానే యువజనుల ఆత్మహత్యలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ సంఖ్య చైనా కంటే ఆరు రెట్లు అధికం. ఈ దృష్ట్యా మానసిక ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం, హెల్ప్‌లైన్ నంబర్లు, సంప్రదించదగిన మానసిక నిపుణుల సేవలను అందుబాటులో ఉంచడం అత్యవసరం.

ఏపీ బీజేపీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్‌ను జిల్లాకు చెందిన నేతలు విజయవాడలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, జిల్లా పూర్వ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, అట్టాడ రవిబాబ్జి, పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రెడ్డి నారాయణ, పైడి రాజారావు, యువమోర్చా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి, టెక్కలి మండలం అధ్యక్షులు జర్జన రాంజీ తదితరులు ఉన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



## సమాజంలో వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్స్ పాత్ర చాలా కీలకం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజంలో వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్స్ పాత్ర చాలా కీలకమని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ బృందం బుధవారం తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం, ఛార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నాగావళి హోటల్‌లో జిల్లాలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ కనుగుల సుధీర్, డాక్టర్ పైడి మహేశ్వరరావు, ముద్దాడ కనక ప్రసాద్, డాక్టర్ విజయహర్ష, ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఐ.కె. రావు, వి.యం.రావు తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బగాది జగన్మోహన రావు పాల్గొని సమాజంలో వైద్య వృత్తికి గల ప్రాముఖ్యత, ఛార్టర్డ్ అకౌంటెంట్ల యొక్క ప్రాధాన్యత గూర్చి వివరించారు. సభాధ్యక్షులుగా డాక్టర్ పైడి సింధూర వ్యవహరించగా, నటుకుల మోహన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి టెక్కం రాంగోపాల్, కోశాధికారి బరాటం క్రిష్ణ చైతన్య, పూర్వ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, పొన్నాడ రవికుమార్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ బాడాన దేవభూషణరావు, చదువుల ఈశ్వరరావు, శిల్లా మణి, భోగెల ఉమామహేశ్వరరావు, పొదుగు చరణ్, సీనియర్ డా.పి.బి.కామేశ్వరరావు, డా.మాలతి, డా.మొదలవలస మురళీకృష్ణ, డా.సనపల రవికుమార్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హర్షవల్లి లయన్స్ సేవలు అమోఘం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా వైద్యరంగంలో నిపుణులైన వారిని హర్షవల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానికంగా గల ఒక హోటల్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హర్షవల్లి లయన్స్‌క్లబ్ సేవలు అమోఘమని పేర్కొన్నారు. వైద్యరంగంలో వస్తున్న మార్పులు ఎన్ని ఉన్నా, కాలుష్య నివారణ లేకపోవడం వలన, కొంతమందిలో ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన లేకపోవడం వలన వ్యాధులు విజృంభించి తద్వారా ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. హర్షవల్లి లైన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అధ్యక్షుడు డాక్టర్ మేడిశెట్టి సత్య స్వరూప్ మాట్లాడుతూ భవిష్యత్తులో వివిధ రంగాలతో మిళితమైన వైద్య శిబిరాలను హర్షవల్లి లైన్స్ క్లబ్ ద్వారా శ్రీకాకుళం పట్టణ పరిసర ప్రాంతాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం వైద్యులను ఘనంగా సన్మానించింది. సన్మానితులలో డాక్టర్ కింజరాపు అమ్మన్ నాయుడు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ మేడిశెట్టి స్వరూప్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ రవితేజ, డాక్టర్ భార్గవ్, డాక్టర్ వినుతలున్నారు. సమావేశంలో పూర్వ జెడ్పి కరణం శోభారాణి, ఎక్స్టెన్షన్ ప్రెసిడెంట్ హారికా ప్రసాద్, కార్యదర్శి పార్వతీశ్వరరావు, ట్రెజరర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, మణిశర్మ, లక్ష్మీకాంత్, నిహార్, కల్లేపల్లి ఉషా ఉషారాణి, జ్యోతిర్మయి చంద్రమోహన్, పాలిశెట్టి మధుబాబు, మీసాల మాధవి, గణపతి తదితరులు పాల్గొన్నారు




## ఇంటింటికీ తెలుగుదేశంలో ఎంజీఆర్

(సత్యంన్యూస్, పాతపట్నం)

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం పాల్గొని ప్రారంభించారు. దీనిలో భాగంగా హిరమండలం మండలం ధనుపురం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గం పరిశీలకులు బుద్ధ త్రినాధరావు, నాయకులు క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలు కార్యకర్తలు పాల్గొన్నారు.



### బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా

## పరమేశ్వరరావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జిల్లాకు చెందిన జన్ని పరమేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ అధిష్టానం ఆయన నియామకం చేపట్టింది. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోడీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యవర్గం నియమించారన్నారు. అందులో తనకు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా అవకాశం కల్పించడం ఆనందదాయకంగా ఉందన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన జిల్లా అధిష్టానానికి, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు వచ్చిన అవకాశాన్ని పార్టీ బలోపేతానికి శతశాతం వినియోగిస్తానని స్పష్టం చేశారు.



# పవన్ ఆదుకున్నారు!

సోషల్ మీడియా వచ్చాక ప్రపంచం అరచేతిలోకి వచ్చింది.. ఏ మూల ఏ సంఘటన జరిగిన క్షణాల్లో సమాచారం చేరిపోతుంది. దీని పుణ్యమా అని రాత్రికి రాత్రి కొందరు సెలెబ్రిటీలు అయిపోతున్నారు. పూసలు అమ్ముకునే అమ్మాయి అలా రాత్రికి రాత్రి సినీ నటి అయిపోయింది. ఇబ్బందుల్లో ఉన్నవాళ్లు కష్టాల నుంచి గట్టెక్కుతున్నారు. అందుకే చాలామంది బతికి చెడ్డవాళ్ళు తమ కష్టాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. అలాగే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సినీ క్యారక్టర్ నటి వాసుకి (పాకీజా ఫ్రేమ్) ఏడుస్తూ తన కష్టాలను ఒక వీడియోలో చెప్పి సోషల్ మీడియాలో ఉంచింది

### ఆ వీడియోలో ఆమె ఏమన్నారంటే..

తన ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని.. అయినవాళ్లు ఎవరూ లేకపోవడంతో తమిళనాడు తన సొంత ఊరిలో ఒంటరి జీవితం గడుపుతున్నానని.. గతంలో చిరంజీవి, నాగబాబు అన్నయ్యలు సాయం చేయబట్టి కొంతకాలం నెట్టుకొచ్చా నని.. ఇప్పుడు మళ్ళీ తన ఆర్థిక పరిస్థితి మొదటికి వచ్చిందని పూట గడవటం కష్టంగా ఉందని ఏడుస్తూ చెప్పింది. అందుకే ఏపీ ముఖ్య మంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లను కలిసి తనకు పెన్షన్ సౌకర్యం ఇప్పించవల సిందిగా వేడుకుందామని వెళ్తే సెక్యూరిటీ ఇబ్బందుల దృష్ట్యా తాను వాళ్ళను కలవలేకపోయానని.. ఎవరైనా సాయం చేసి తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు అయితే వాసుకీ విడుదల చేసిన ఈ వీడియో పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లడంతో వెంటనే ఆయన వాసుకిని పిలిపించి రెండు లక్షల ఆర్థిక సాయాన్ని పార్టీ విప్ ద్వారా ఆమెకు ఇప్పించారు. తన కష్టాలకు వెంటనే స్పందించి ఆదుకున్న పవన్‌కళ్యాణ్ తనకు దేవుడి లెక్క అని ఆమె కన్నీటి పర్యంతం అవుతూ చెప్పింది. ఏది ఏమైతేనేమి వాసుకి కష్టాలకు తక్షణం కొంత రిలీఫ్ దొరికింది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ తక్షణ స్పందనకు పలువురు నెటిజన్లు హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తున్నారు !!

- పరేష్ తుర్లపాటి

# తీర్చిదిద్దిన శిల్పంలా మౌని

మౌనిరాయ్ పరిచయం అవసరం లేదు. నాగిన్‌బ్యూటీ 'గోల్డ్' అనే చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టి, అటుపై 'కేజీఎఫ్'లో స్పెషల్ నంబర్‌తో సౌత్ లో అడుగుపెట్టింది. మౌని ఇంతకుముందు రణబీర్ 'బ్రహ్మాస్త్ర'లోను తన అతిథి పాత్రతో ఆకట్టుకుంది. ఇక దిశా పటానీతో స్నేహం కారణంగాను మౌనిరాయ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బుల్లితెర నుంచి వెండితెరకు పరిచయమైన ఈ అమ్మడు కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్‌లో ఉంది.

మరోవైపు సోషల్ మీడియాల్లోను మౌని అన్‌స్టాపబుల్‌గా దూసుకుపోతోంది. ముఖ్యంగా ఇన్‌స్టా వేదికగా భారీ ఫాలోయింగ్ ఉన్న తారల్లో ఒకరిగా మౌని పాపులరైంది. తాజాగా ఈ భామ నాచు రంగు ట్రెడిషనల్ దుస్తుల్లో గుబులు రేపుతున్న ఫోటోలు ఇంటర్నెట్‌ని షేక్ చేస్తున్నాయి. స్లీవ్‌లెస్ బ్లౌజ్.. బ్రాలెట్-స్టైల్‌తో మౌని ఇంటర్నెట్ ని కిల్ చేసింది. అయితే తన టోన్డ్ దేహశిరుల్ని కవర్ చేసేందుకు చీర కానీ, దుపట్టా కానీ ఎంతమాత్రం సహకరించలేదు. ఈ కొత్త లుక్ లో మౌని అందచందాలకు యువతరం ఫిదా అయిపోతోంది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారుతోంది.

మౌని ప్రస్తుత కెరీర్ మ్యాటర్‌కి వస్తే.. తదుపరి మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'విశ్వంభర'లో ఒక ప్రత్యేక పాటలో కనిపించనుది. ఈ భారీ ఫాంటసీ డ్రామా మూవీని పాన్ ఇండియా మార్కెట్లో రిలీజ్ చేయాలనేది ప్లాన్. జాతీయ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.




- తుపాకి.కామ్ సౌజన్యంతో..

## 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

33/11 కె.వి పార్వతీశంపేట సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ వెంకయ్యపేట ఫీడర్ మరమ్మత్తులు, దెబ్బతిన్న పోల్స్ మార్పడంలో భాగంగా ఈనెల 4న ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపాలిటీ పరిధిలో గల తిమ్మాపురం, జగ్గుశాస్త్రుల పేట, ఏపీ టిడ్కో, చంద్రహాస్, ఆక్వా, కేజీబీవీ స్కూల్, ఆర్ఆర్ గ్రానైట్స్, మండాది బ్రిక్ ఇండస్ట్రీస్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



వజ్రపుకొత్తూరు మండలం చిన్నవంక పంచాయతీ గుళ్లలపాడులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పరిశీలకులు చౌదరి బాబ్జి, క్లస్టర్ కన్వీనర్ దువ్వాడ హేంబాబు చౌదరి, మండల అధ్యక్షులు సూరాడ మోహన్, పేరుకల విట్టల్, సింగుపల్లి బాల కృష్ణ బాగాతి రాజారావు, భాస్కర్ చౌదరి పాల్గొన్నారు

– సత్యంన్యూస్, పలాస


## 'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రారంభోత్సవంలో ఎంపీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రారంభోత్సవంలో కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు బుధవారం నియోజకవర్గ పరిధిలోని జి.సిగడాం మండలం, ఆనందపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో గల షిర్డీ సాయినాధుని దేవాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం పార్టీ నాయకులు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇంచార్జ్, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు పరుస్తామని తెలియజేసారు.



## తామరాపల్లిలో సుపరిపాలన తొలి అడుగు




(సత్యంన్యూస్, నరసన్నపేట)

టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. బుధవారం తామరాపల్లిలో సుపరిపాలన తొలి అడుగుకు శ్రీకారం చుట్టారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు ఏమేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అధికారం చేపట్టిన ఏడాదిలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో అధిక శాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే, వైకాపా నేతలు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తాము ఇచ్చిన హామీలను అమలు చేసేం కాబట్టే ధైర్యంగా తొలి అడుగుతో ప్రజల మధ్యకు వచ్చామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నియోజకవర్గ అబ్జర్వ్ కొయిలాడ వెంకటేష్, రాష్ట్ర బి.సి.సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్, నరసన్నపేట, పోలాకి మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, గొద్దు చిట్టిబాబు, పూతి రమణ, అడపా చంద్రశేఖర్, భైరి భాస్కరరావు, కింజరాపు రామారావు, రెడ్డి సతీష్, గొద్దు జగన్మోహన్, కోల రాము, సింహాచలం, కూటమి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపాతోనే జిల్లా ప్రగతి సాధ్యం

(సత్యంన్యూస్, టెక్కలి)


వెనుకబడిన టెక్కలి నియోజకవర్గం శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందాలనే దృఢనిశ్చయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూలపేట పోర్టు మంజూరు చేసి త్వరితగతిన పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం వైకాపా సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 40ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజల ఓట్లతో పదవులు అలంకరించిన అచ్చెన్నాయుడు పోర్టు ప్రాంతానికి వెళ్లి జగన్మోహన్ రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా తన సొంత అభివృద్ధితో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్న అచ్చెన్నాయుడు ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడ్డ జగన్మోహన్‌రెడ్డిని వెయ్యి అడుగుల లోతులో పాతేస్తామని అంటున్నారని, అటువంటి అచ్చెన్నాయుడిని ఎన్ని అడుగుల లోతులో పాతిపెట్టాలో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కంపెనీతో అచ్చెన్నాయుడుకు వాటాలు తేలేవరకు పనులు నిలుపుదల చేయించారని ఆరోపించారు. టెక్కలిలో రౌడీ షీటర్‌లతో పాలన చేస్తూ దొంగనోట్ల మాఫియా చేస్తున్న వారితో జట్టు వేసుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. అచ్చెన్నాయుడు చేస్తున్న అరాచకాలకు వత్తాసు పలుకుతున్న అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు ఎంత బడ్జెట్ కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో ఏం చేశారని ప్రజల ముంగిటకు వెళ్తున్నారని ప్రశ్నించారు.



## బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్ట్ ఎడమకాలువ నీటి విడుదల

(సత్యంన్యూస్, హిరమండలం)

పాతపట్నం నియోజకవర్గం హిరమండలం మండలం గొట్ట గ్రామం వద్ద గల బొడ్డేపల్లి రాజగోపాల్‌రావు వంశధార ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 1,48,200 ఎకరాలకు సాగునీటిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ వంశధార ప్రాజెక్టు నిర్వహణ పూర్తిగా లేదని, ఈ ప్రాజెక్టును టూరిజం ప్రదేశంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓ కృష్ణమూర్తి, జిల్లా అధికారులు, నియోజకవర్గ అధికారులు, రైతులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లేబర్ కోడ్లు రద్దు, పనిగంటలు పెంపు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జీతాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ఏఐటీయుసి నాయకులు టి.తిరుపతిరావు, మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు, మున్సిపల్ ఇంజినీరింగ్ జిల్లా కార్యదర్శి ఆర్.సతీష్‌లు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను ఒక్క కలంపోటుతో 4 లేబర్ కోడ్లుగా మార్చడం దుర్మార్గమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్ట్ చెప్పిన అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. అందుకు తగ్గట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం పనిగంటలు 8 నుంచి 10 గంటలకు పెంచడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వై.శ్యామలరావు, సరస్వతి, కరుణ, జి.లక్ష్మి, పార్దసారధి, జె.గురుమూర్తి, రసూల్, చంటి తదితరులు పాల్గొన్నారు.



# పేదప్రజలకు "సీఎం సహాయ నిధి" ఒక వరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక విశాఖ కోలనీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ అర్హులకు సీఎం సహాయనిధిని అందజేసి మాట్లాడుతూ అత్యవసర వైద్యచికిత్స అవసరమైతే, పేదలకు సాయం అందించటంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రత్యేకదృష్టి సారిస్తున్నారని, రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలు సీఎంఆర్‌ఎఫ్‌తో లబ్ధి పొందాయని, ఆరోగ్యశ్రీ పరిధిలో లేని చికిత్సలు, ఆర్థికస్థోమత లేని పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రాణాపాయంలో ఎవరున్నా సరే.. వైద్య చికిత్స అత్యవసరమని గుర్తించిన ప్రజా ప్రభుత్వం ఎల్వోసీల జారీని వేగవంతం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం, పేద ప్రజలకు భరోసా అని, సీఎం సహాయనిధిని వైద్య నిమిత్తం ఖర్చు చెయ్యాలని, పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరమన్నారు. సీఎం సహాయనిధిలో భాగంగా పదమూడు మంది లబ్ధిదారులకు రూ.7,46,851ల చెక్కులను అందించారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ ఆర్థిక స్థోమతలేని తమకు సహాయాన్నందించిన ముఖ్యమంత్రికి, అందుకు సహకారాన్నందించిన నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ప్రత్యేక ధన్యావాదాలన్నారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, నగర, మండల, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులు క్రమశిక్షణతో, ఉన్నత చదువులు చదవాలని, పాఠశాలకు, గురువులకు, తల్లితండ్రులకు మంచిపేరు తేవాలని ప్రముఖ కంటి వైద్యురాలు పి.సుధీర అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ దరిలో గల శ్రీ సత్యసాయి పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థికి, టీడీపీ 32వ డివిజన్ ఇన్‌చార్జి, పాఠశాల డైరెక్టర్ మధుసూధనరావు పట్నాయక్ ఉచితంగా సమకూర్చిన యూనిఫామ్, పుస్తకాలు, చదువుకు అవసరమైన సామగ్రిని బుధవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై అందించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని దానాల్లో విద్యాదానం గొప్పదన్నారు. పేద విద్యార్థులకు ఏదో ఒక రూపంలో సహాయమందిస్తే వారి ఉన్నత చదువులకు ఆటంకం ఉండదన్నారు. పాఠశాల డైరెక్టర్ మధుసూదన్ సేవా దృక్పధంతో ఆలోచించి తన పాఠశాలలో చదివే విద్యార్థులకు సహాయమందించటం గొప్పవిషయమన్నారు. విద్యార్థులు గురువే మొదటి దైవంగా భావించి, వారి సూచనలను తూచా తప్పకుండా పాటిస్తే, ప్రతీ విద్యార్థి ఉన్నత స్థానంలో నిలుస్తారని, సత్యసాయి పాఠశాలకు ఎన్నో ఏళ్ళ చరిత్ర ఉందని, ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ కొలువులతో స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో సత్యసాయి పాఠశాల ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్సి) 2025 సంవత్సరానికి సంబంధించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్) పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్ 'బి' మరియు 'సి' పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ అయిందని, మొత్తం 14582 ఖాళీలు ఉండగా, ఆగస్ట్ 13 నుంచి 30 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు జరగనున్నాయని అన్నారు.

**దరఖాస్తు చివరి తేదీ:**

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ జూలై 4 రాత్రి 11గంటల వరకు కాగా, ఫీజు చెల్లింపునకు గడువు జూలై 5 రాత్రి 11 వరకు. దరఖాస్తు సవరణకు అవకాశం జూలై 9 నుంచి 11 వరకు ఇచ్చారన్నారు. ఈ నోటిఫికేషన్ ద్వారా 37రకాల ఉద్యోగాలు భర్తీ కానున్నాయన్నారు. ఇన్కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, పోస్టల్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్, ఆడిటర్ లాంటి పోస్టులకు అర్హతలు, ఫీజు, దరఖాస్తు విధానం మొదలైన వివరాల కోసం అభ్యర్థులు https://ssc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని లేదా మై ఎస్ఎస్సి మొబైల్ యాప్ ద్వారా చేసుకోవచ్చన్నారు.

# 5న లక్ష సంతకాల సేకరణ


(సత్యంన్యూస్, పలాస)

ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి నిరసనగా ఈనెల 5న లక్ష సంతకాల సేకరణను ఉదయం 9గంటలకు వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరు గ్రామంలో గల కమ్యూనిటీ భవనంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈమేరకు స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు బాధితులు మాట్లాడుతూ కోనసీమను తలపించే పచ్చని ఉద్దానాన్ని, తీరప్రాంతాన్ని ధ్వంసం చేసే కార్గో ఎయిర్పోర్ట్ తమకు వద్దన్నారు. గత ఎనిమిది నెలలుగా వివిధ రూపాలలో దశలవారీగా మా నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి తెలియజేస్తూనే ఉన్నామన్నారు. ఉద్దానమంటే ఉద్యానవనమని, ఇక్కడ లక్షలాది సంఖ్యలో జీడిమామిడి, కొబ్బరి, మునగ, పనస, అరటి, మామిడి వంటి ఎన్నో వృక్షజాతులతో సముద్ర హోరుగాలుల మధ్యన కోనసీమను తలపిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన ప్రాంతంగా పేరుందన్నారు. అటువంటి తమ ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్ట్ పేరిట సుమారు 1400ఎకరాలు భూమిని ప్రభుత్వము భూసేకరణ చేసి ఈ వృక్షాలను తొలగిస్తే ఇక్కడ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. ఈ వృక్షాల ఉండడం వల్లనే శ్రీకాకుళం జిల్లాకు ఆక్సిజన్ కోదవ లేకుండా ఉందన్నారు. తీరప్రాంతంలో ఉన్న తమ గ్రామాలకు భారీ తుఫానుల సమయంలో ఈ వృక్షాలు రక్షణగా ఉన్నాయన్నారు. బేతాళపురం, రాంపురం, మెట్టూరు పంచాయితీ పరిధిలోని సుమారు 16 గ్రామాల ప్రజలు ఈ భూములపైన ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో సుమారు 45 తీరప్రాంత గ్రామాలున్నాయని, ఈ గ్రామాల ప్రజలందరూ తీవ్రంగా నష్టపోతారన్నారు. తమ భూములు కార్గో ఎయిర్‌పోర్ట్ పేరిట కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి ప్రభుత్వం తమ అనుమతి లేకుండా, ప్రజాభిప్రాయసేకరణ జరపకుండా బలవంతంగా భూసేకరణ చేస్తామంటే ఉపేక్షించేది లేదన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ చొరవచూపి ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధ్యక్షుడు కొమర వాసు, చీపురుపల్లి సర్పంచ్ జోగి అప్పారావు, దున్న హరికృష్ణ, కొండ తులసిదాస్, పొట్టి రాజు, సుంకర భాస్కర్ రావు, సుంకర రాజు, గుంటు లోకనాథం, బొండాడ చిన్న అప్పన్న, లైసెట్టి దమయంతి, లైసెట్టి శోభ, యవ్వకుల జగదీశ్వరి, గుంటు రాజు తదితరులు పాల్గొన్నారు.



## వైకాపా సమావేశానికి తరలిరండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఈనెల 3న వైకాపా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశానికి తరలి రావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సన్‌రైజ్ హోటల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశంలో శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజనల్ కో–ఆర్డినేర్ కురసాల కన్నబాబు, పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు కుంభా రవిబాబు, మాజీ స్పీకర్, శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ పార్టీ కో–ఆర్డినేటర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, నియోజకవర్గ సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు హాజరవుతారన్నారు. కావున ఈ ముఖ్య సమావేశానికి మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి పార్టీ కమిటీలో వివిధ హోదాలో గల సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు, మాజీ డీసీసీబీ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని విజయవంతం చేయాలని కృష్ణదాస్ ఆ ప్రకటనలో కోరారు.















## CHANGE OF NAME

Earlier my name is **BODDEPALLI SANTHOSH KUMAR** S/o BODDEPALLI GOPALA RAO, resident of D.No.: 15-128, sandeep nilayam, DCCB Colony, Near Indu beauty parlour, Srikakulam town and District, Andhra Pradesh, Pin: 532 001. Presently my name was changed to **BODDEPALLI SANTOSH KUMAR** S/o BODDEPALLI GOPALA RAO. therefore now on I will do future correspondence in the name of **BODDEPALLI SANTOSH KUMAR.**


# ఇంటింటికీ సుపరిపాలన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది సుపరిపాలనను ఇంటింటికీ తెలయజేసే కార్యక్రమాన్ని నగరంలో చేపట్టినట్టు టీడీపీ సీనియర్ నాయకులు పాండ్రంకి శంకర్ స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని 15వ డివిజన్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజనల్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేసిన, చేయబోతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంట్లో ఎంత మందికి సంక్షేమ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూనే సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సమర్ధవంతమైన నాయకత్వం ఉండడం వల్లనే రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకు వెళుతుందన్నారు. వైకాపా నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎమ్మెల్యే గొండు శంకర్ పని చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ పనితీరు పట్ల నియోజకవర్గ ప్రజలు సంతృప్తివ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు ప్రధాన విజయరాం, 166 బూత్ ఇన్‌ఛార్జి పాండ్రంకి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

## జంగిల్ క్లియరెన్స్ పనులు
# త్వరితగతిన పూర్తి చేయాలి

- నియోజకవర్గంలో రూ. 97కోట్లతో తాగునీటికి చేపడుతున్న పనులపై గ్రామాల వారీగా నివేదిక ఇవ్వండి
- క్షేత్రస్థాయిలో అధికారులు గ్రామాల్లో పర్యటించండి
- రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



(సత్యంన్యూస్, టెక్కలి)

ఉపాధి హామీ నిధులతో ప్రధాన రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం నిమ్మాడ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గ్రామీణ రహదారులు, పంచాయతీరాజ్ శాఖ రహదారులకు ఇరువైపులా పెద్ద ఎత్తున ముళ్లపొదలు, ఇతర పిచ్చి మొక్కలు పెద్ద ఎత్తున ఉన్నాయని, వర్షాకాలంలో పాములు, ఇతర విష జంతువులు సంచరించే అవకాశం ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు లేకుండా జంగిల్ క్లియరెన్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా ఏపీవోలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సాగునీటి సరఫరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో రూ.97 కోట్లతో చేపడుతున్న పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గ్రామాల వారీగా తయారుచేయాలని సూచించారు. తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందుకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని అధికారులు స్వయంగా పర్యటించి ఆయా గ్రామాల్లో అవసరమైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు, సుధాకర్, రామకృష్ణ, అంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల వ్యవసాయ శాఖలో బదిలీలు సజావుగా జరిగిన సందర్భంగా మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.అనిత తదితరులు ఉన్నారు.


## CHANGE OF NAME

I **KANCHARAPU HARITHAMMA** D/o **KANCHARAPU JANARDHANARAO** previously called **KANCHARAPU HARITHA**, presently residing at chodavaram village, Narasannapeta Mandal, Srikakulam District, Now changed my name from **KANCHARAPU HARITHA** (old name) to **KANCHARAPU HARITHAMMA** (new name) hence forth be known as **KANCHARAPU HARITHAMMA** for all purposes.


# పింఛన్లు పునరుద్ధరించండి

- ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ
- త్వరలోనే మంజూరు చేస్తామని మంత్రి హామీ



(సత్యంన్యూస్, టెక్కలి)

కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతలు పెద్ద ఎత్తున వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను మంత్రికి వివరించారు. గత ప్రభుత్వం వితంతు పింఛన్లు నిలిపివేశారని, వాటిని మంజూరు చేయాలని పెద్ద ఎత్తున వినతి పత్రాలు అందజేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ అతి త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా నూతన నివాసం మంజూరు చేయాలని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సాగునీరు అందించాలని కోరారు. సాగునీరు ఇబ్బందులు లేకుండా చూస్తామని, ఈ రోజు నీరు విడుదల చేశామని మంత్రి తెలిపారు. నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## CHANGE OF NAME

I **SAILADA MANGAMMA** W/o **SAILADA NARAYANA RAO** previously called **SAILADA MANGA**, presently residing at chodavaram village, Narasannapeta Mandal, Srikakulam District, Now changed my name from **SAILADA MANGA** (old name) to **SAILADA MANGAMMA** (new name) hence forth be known as **SAILADA MANGAMMA** for all purposes.


# దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సిటు జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ పిలుపునిచ్చారు. అరిణాం-అక్కివలస వద్ద గల శ్యామ్ పిస్టన్స్ ప్లాంట్-3 వద్ద సమ్మె పోస్టర్ ఆవిరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పాటు కార్మిక వర్గం పోరాడి అశేష త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ నాయకత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందని అన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమదోపిడీని మరింత పెంచుకోవడం కోసం, పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్.ఐ.సి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.సూర్యనారాయణ, ఎస్.దుర్గారావు, పి.శ్రీనివాసరావు, కె.సంతోష్‌కూమార్, ఎ.వైకుంఠం, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

# 'స్థానిక' ప్రతినిధులపై సిరికన్ను!

(మొదటిపేజీ తరువాయి)

సర్వసభ్య, స్థాయి సంఘ సమావేశాలకు హాజరయ్యే జెట్పీటీసీలకు రవాణా అలవెన్స్‌లు చెల్లించే సంప్రదాయం ఉండేది. అలాగే గౌరవ వేతనాన్ని సమావేశాలకు వచ్చిన రోజునే కవర్‌లో పెట్టి అందించేవారు. ఆయన తదనంతరం అలవెన్స్ చెల్లించే ప్రక్రియను నిలిపేశారు. కవర్‌లో పెట్టి గౌరవ వేతనం ఇచ్చే సంప్రదాయానికి కూడా స్వస్తి పలికి సీఎఫ్ఎంఎస్ ద్వారా గౌరవ వేతనాలు జమ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. 2014 తర్వాత జెట్పీటీసీలు గౌరవ వేతనం అందుకోవడమే గగనమైపోయిందన్న విమర్శలు ఉన్నాయి. 2019లో ఏర్పడిన వైకాపా ప్రభుత్వం జెట్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌ల వేతనాలను రెట్టింపు చేసి ఆ మేరకు 2021 సెప్టెంబర్ నుంచి 2023 జూలై వరకు 11 నెలలు మాత్రమే చెల్లించింది. ఆ విధంగా వైకాపా పాలనలో 21 నెలలు, కూటమి పాలనలో 12 నెలల గౌరవ వేతనం చెల్లించలేదు. దీనిపై పంచాయతీరాజ్ కమిషనరేట్ నివేదిక కోరిందని, బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నారని జెడ్పీ అధికారులు చెబుతున్నారు. అయితే ఎప్పటిలోగా చెల్లిస్తారో తెలియదని చెప్పడం కొసమెరుపు.

## ధర్నాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా పాల్గొనాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ ఈ నెల 4, 5 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ధర్నాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా పాల్గొనాలని, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టి.ముత్యాలరావు, బి.కుమార్‌నాయక్, ఇతర నాయకులు పిలుపునిచ్చారు. ఈమేరకు యూనియన్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 7300 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు 129 డిపోల్లో నిర్వహించబోతున్న ధర్నా కార్యక్రమాల్లో ఏపీపీటీడీ ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ కార్మికుల పూర్తి మద్దతు ఉంటుందని, కార్మికులందరూ పాల్గొనాలని అసోసియేషన్ పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం ద్వారా వేతనాలు చెల్లించాలని, కార్మికులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

# యువజన విభాగం చాలా క్రియాశీలకమైంది



- మీ ఫోనే మీ ఆయుధం.. ఒక్క పోస్టు పెట్టండి చాలు
- వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి
- తాడేపల్లి కార్యాలయంలో యువజన విభాగం ప్రతినిధులతో సమావేశం

(సత్యంన్యూస్, విజయవాడ)

యువజన విభాగం చాలా క్రియాశీలకమైందని, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని నిలదీయడంలో యువత కీలక పాత్ర పోషించాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో యువజన విభాగం ప్రతినిధులతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైకాపా జాతీయ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి యువతను ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీలో లీడర్లుగా ఎదిగేందుకు ఇప్పుడు యువతకి గొప్ప అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో ఫోన్ ఓ ఆయుధమని, ఏ అన్యాయం జరిగినా ఒక్క పోస్టు పెడితే, పార్టీ మొత్తం అండగా ఉంటుందని చెప్పారని సమావేశంలో పాల్గొన్న శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా యువజన విభాగం అధ్యక్షులు గుండ హరీష్ తెలిపారు.

# ఫిర్యాదుపై స్పందించిన అధికారులు

- పూడిక తీత, ముళ్లపొదలు తొలగింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని పీఎన్ కాలనీ ఐదో లైన్‌లో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని నగర వైకాపా ప్రధాన కార్యదర్శి సీపాన మహేంద్ర సోమవారం గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై నగరపాలక





సంస్థ అధికారులు స్పందించారు. బుధవారం ఐదోలైన్‌లో అపోలో ఫార్మసీకి ఎదురుగా నారాయణ తిరుమల దేవాలయానికి వెళ్లే రోడ్డులో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం చూపించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను జేసీబీతోను, మేన్ పవర్‌తో కాలువలో పూడికను తొలగించారు. ఈ సందర్భంగా మహేంద్ర మాట్లాడుతూ స్థానికులు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపించిన నగరపాలక అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గత వారం రోజులుగా కురుస్తున్న తేలిక పాటి వర్షాలకు రోడ్డుపై నీరు చేరడంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫిర్యాదుపై స్పందించి నగరపాలక అధికారుల చొరవతో సమస్యను పరిష్కరించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇదే మాదిరిగా కాలనీలో మిగతా సమస్యలకు పరిష్కారం చూపించాలని కోరారు.



# ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

- శాసన సభ్యులు గొండు శంకర్
- వెంకటాపురంలో రోడ్లు ప్రారంభం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

ప్రతీ గ్రామాన్ని సుందర గ్రామంగా మారుస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం నైర పంచాయతీ, వెంకటాపురం గ్రామంలో రోడ్లను ప్రారంభించి మాట్లాడారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం గ్రామాన్ని మొదలుపెట్టడం ఆనందంగా ఉందన్నారు. రూ.46 లక్షలతో నిర్మించే ఈ రోడ్లు గార, చింతాడకు అనుసంధానంగా ఉంటుందన్నారు. ఏడాదిలో సుమారు రూ.80లక్షల వరకు గ్రామానికి అభివృద్ధికి ఖర్చు చేశామని, ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలనే దృఢసంకల్పంతో ముందుకు వెళ్తున్నారన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ప్రజా శ్రేయస్సుకు అమలుపరిచే సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తున్నామని, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ శీర రమణయ్య, టీడీపీ నాయకులు, రూరల్ అధ్యక్ష శ్రీనివాస్ బృందం, సర్పంచ్, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


## అద్దెకు ఇవ్వబడును

చిన్నబజారు దూదివారి కోవెల ఎదురుగా
మూడు ఫ్లోర్ల బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును.
ఒక్కో ఫ్లోర్ 1200 చదరపు అండుగులు (20×60)
- వివరాలకు సంప్రదించగలరు -
9866 222 636


Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.